సాక్షి
సిద్దిపేట
బుధవారం । 13 । నవంబర్ । 2024

ముగ్గమ్మా.. ముగ్గు..



రిక్షాలో మిర్చి బస్తాలను తీసుకెళ్తూ..





భారమైనా లాగాల్సిందే..

బతుకు బండి.. భారమండి

రెక్కాడితేనే డొక్కాడుతుంది. కష్టపడితేనే కూడు దొరుకుతుంది.. బతుకులపై బాధ్యతల భారమేకాక.. బతుకుబండి భారం కూడా ఎక్కువే. తెల్లారితే చిరువ్యాపారులు ఇచ్చే సరుకు బస్తాలు, కూరగాయలు తదితర వస్తువులతో జీవన ప్రయాణంలో ముందుకు సాగిపోతున్నారు..అలాగే వీధుల్లో తిరుగుతూ ముగ్గు అమ్ముకుంటున్న మహిళ కూడా బతుకుబండి సాగిస్తున్న దృశ్యాలను జిల్లా కేంద్రంలో సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



దేదీప్యమానం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, అధికారులు రుద్రకవచ పఠనం, మహామృత్యుంజయ అక్షరమాల పారాయణం చేశారు. -కొమురవెల్లి(సిద్దిపేట)

న్యూస్‌రీల్

సింగరాయ ప్రాజెక్టులోకి చేప పిల్లలు



చేప పిల్లలను వదులుతున్న డీఎఫ్‌ఓ వర్ధారెడ్డి, మత్స్యకారులు

కోహెదరూరల్(హుస్నాబాద్): గుండారెడ్డిపల్లి శివారులోని సింగరాయ ప్రాజెక్టులోకి మత్స్య శాఖ డీఎఫ్‌ఓ వర్ధారెడ్డి ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుండారెడ్డిపల్లి, తంగళ్లపల్లి గ్రామాల మత్స్యకారులు డీఎఫ్‌ఓను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు సుతారి కనుకరాజు, సింగరాయ ప్రాజెక్టు కార్యదర్శి కొత్తూరి యాదగిరి, మేడవేని పరశురాములు, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య



అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జంగపల్లి వెంకటనర్సయ్య జాతీయస్థాయి సైక్లింగ్ జట్టుకు మేనేజర్‌గా ఎంపికయ్యారు. చెన్నైలో ఈ నెల 15వ తేదీ నుంచి 19వరకు జాతీయస్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు జరగనున్నాయి. మేనేజర్‌గా వెంకటనర్సయ్య ఎంపికపై మంత్రి పొన్నం ప్రభాకర్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి గుగులోతు రంగనాయక్, ఉపాధ్యాయులు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

గజ్వేల్: మండల పరిధి జాలిగామలోని వాసవీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులకు పత్తిని అమ్ముకోకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా బయ్యారం రోడ్డు వైపున ఉన్న శివగంగ జిన్నింగ్ మిల్లు, జగదేవ్‌పూర్ మండలం అలిరాజపేటలోని విశ్వతేజ జిన్నింగ్ మిల్లులలోనూ సీసీఐ కేంద్రాలను ప్రారంభించారు.

రేపటి నుంచి సిటీ పోలీస్‌యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా అమల్లో ఉంటాయన్నారు.

సాహితీ పురస్కారం



బాలసాహితీ పురస్కారం అందుకుంటున్న ఎన్నవెల్లి రాజమౌళి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలసాహిత్యంలో విశేష కృషి చేస్తునందుకు ప్రముఖ కవి ఎన్నవెల్లి రాజమౌళికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం ప్రదానం చేసినట్లు బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. ఎన్నవెల్లి రాజమౌళికి మంగళవారం నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కేవీ రమణ, నిత్యానందరావు, కిషన్‌రావుల చేతుల మీదుగా సాహితీ పురస్కారం, రూ.20వేల నగదును అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కవులు ఐతా చంద్రయ్య, ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, పెందోట వెంకటేశ్వర్లు, డబ్బికార్ సురేందర్ తదితరులు పాల్గొన్నారన్నారు. రాజమౌళి బాలసాహిత్య పురస్కారం అందుకోవడం పట్ల పలువురు కవులు అభినందనలు తెలిపారు.

ఇండస్ట్రియల్‌పై రగడ

ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణ అంశంపై అగ్గిరాజుకుంటోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ చౌటపల్లి క్రాసింగ్ వద్ద నిర్మించవద్దంటూ రైతులు ఆందోళనబాట పట్టారు. మరోవైపు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇండస్ట్రియల్ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులను అడ్డుకోవడమే కాకుండా వెనక్కిపంపించారు.

నిర్మాణానికి రైతుల ససేమిరా
- మా భూముల జోలికి రావొద్దంటూ అల్టిమేటం
- చౌటపల్లిలో నిర్మించవద్దంటూ ఆందోళన
- సంకటస్థితిలో రెవెన్యూ అధికారులు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చౌటపల్లి రైతులు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు దాదాపు 130నుంచి 150ఎకరాలను కేటాయిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చౌటపల్లి గ్రామ శివారులో గల సర్వే నంబర్ 312లో 85ఎకరాల 13గుంట భూమిని గుర్తించారు. అయితే ఈ భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి కావడంతో పాటు పలువురు రైతులకు కొన్నేళ్ల కిత్రం పంపిణీ చేశారు. సుమారు 130కుటుంబాల రైతులు ఈ భూముల్లో సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ భూములన్నీ ప్రధాన రహదారికి అనుకొని ఉండడంతో గుంటకు రూ.4లక్షల నుంచి 6లక్షల వరకు పలుకుతోంది. ఈ తరుణంలో కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులు తాము చావైనా చస్తాం కానీ భూములు ఇవ్వబోమని అల్టిమేటం జారీ చేస్తున్నారు.

అక్కన్నపేటలోనే ఏర్పాటు చేయాలి..

మండల కేంద్రంలోని ఏనే శివారులో గల సర్వే నంబర్ 387లో 610ఎకరాలపై చిలుకుగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో విడతల వారీగా పేదలకు పంపిణీ చేయగా ఇంకా సుమారుగా 321ఎకరాల పైగా ప్రభుత్వ భూమి ఉంది. దీంతో రెండు నెలల కిందట తహసీల్దార్ అనంతరెడ్డి నేతృత్వంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట 81ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అంతా సిద్ధం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఆర్డీఓ రామ్మూర్తి స్థల పరిశీలన సైతం చేపట్టారు. దీంతో మండల ప్రజలు ఇండస్ట్రియల్ పార్క్ అక్కన్నపేటలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించవద్దంటూ ఒక వైపు ఆందోళనలు జరుగుతున్నా మరోవైపు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతుండటం గమనార్హం.



చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం ఇదే..

మూడు గ్రామాల సరిహద్దులో..

చౌటపల్లి, తోటపల్లి, జనగామ గ్రామాల సరిహద్దుల్లో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి సిద్ధం చేస్తున్నారు. తోటపల్లి శివారులోని 478, 479, 480, 481 సర్వే నంబర్ల గల పట్టా భూములను తీసుకునేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే జనగామ శివారులో 76,77,78,79, 812, 813, 814, 815 సర్వే నంబర్లలో పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు మ్యాప్‌లు తయారు చేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అంటే చౌటపల్లిలో 85ఎకరాల 13గుంటల ప్రభుత్వ భూమి గుర్తించారు. అయితే ఇదీ పూర్తి పేదలకు పంచిపెట్టారు. మిగిలిన తొటపల్లి, జనగామ గ్రామాల శివారులో ఉన్న దాదాపు 45ఎకరాల పట్టా భూములు సేకరించేందుకు అధికారులు జాబితాను తయారు చేశారు.

న్యాయం చేస్తాం.. ఆందోళన వద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణ అంశంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో పర్యటించిన మంత్రి పొన్నంను చౌటపల్లి రైతులు కలిసి తమ గోసను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణంతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు భారీ ఎత్తున వస్తాయన్నారు. పార్కు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులందరికీ సంపూర్ణ న్యాయం చేసిన తరువాతే భూములు తీసుకుంటామని భరోసా కల్పించారు. మంత్రిని కలిసిన వారిలో రాజేందర్, జి.బాలవ్వ, సీహెచ్ యాదగిరి, కె.రమేశ్, ఎల్లయ్య, వెల్ది రంగరావు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంతో మాట్లాడుతున్న చౌటపల్లి గ్రామ రైతులు

స్కూల్‌కాంప్లెక్స్‌లకు రూ.70.62 లక్షలు

ఉమ్మడి మెదక్ జిల్లాకు నిధులు విడుదల
- సిద్దిపేటకు రూ.22.44 లక్షలు
- హెచ్‌ఎంలకు ఊరట

పాపన్నపేట(మెదక్): ఉమ్మడి మెదక్ జిల్లాలోని 214 స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.70.62 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఊరట లభించింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మెదక్ జిల్లాలో 61 కాంప్లెక్స్‌లకు రూ.20.13లక్షలు, సంగారెడ్డి జిల్లాలో 85 కాంప్లెక్స్‌లకు రూ.28.05 లక్షలు, సిద్దిపేట జిల్లాలో 68 కాంప్లెక్స్‌లకు రూ.22.44 లక్షలు చొప్పున నిధులు విడుదలయ్యాయి. సుమారు ఇరవై యేళ్ల క్రితం స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. ఒక ఉన్నత పాఠశాల పరిధిలో 10 నుంచి 15 పాఠశాలలను చేర్చి, వనరులను, సేవలను పరస్పరం వినియోగించుకోవడానికి కాంప్లెక్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పరిపాలన వికేంద్రీకరణతో సత్వర సేవల వినియోగానికి ఆస్కారం ఏర్పడింది. మండల వనరుల కేంద్రానికి అదనపు భారం తగ్గింది. ప్రతి నెలా కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేసి, విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులపై టీచర్లు సమాచారం పంచుకోవడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం, మెరుగైన విద్యను అందిచండానికి తోడ్పడటం జరుగుతోంది. కాంప్లెక్స్ హెచ్‌ఎం తన పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేయడం, తగిన సూచనలు ఇస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు, సర్వీసు బుక్కుల నిర్వహణ, తాత్కాలికంగా టీచర్ల సర్దుబాటు బాధ్యతలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఉంటాయి. కాంప్లెక్స్‌ల నిర్వహణ కోసం ఏడాదికి రూ.33 వేల గ్రాంటు ఇస్తారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 24 శాతం, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 14 శాతం, జనరల్ విభాగం కింద, 62 శాతం నిధులు ఇస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



రోబోటిక్ పరికరాల గురించి తెలుసుకుంటున్న మంత్రి పొన్నం, కలెక్టర్

హుస్నాబాద్: విద్యార్థులు సాంకేతిక విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ముందుండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో రోబోటిక్, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, మొబైల్ యాప్‌ను మంగళవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. పలు ల్యాబ్‌ల్లోని పరికరాలు, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో పెరుగుతున్న సాంకేతిక గురించి సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలన్నారు. సిద్దిపేటలో త్వరలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ ఉంటుందని, ఈ పోటీల్లో హుస్నాబాద్ నుంచి ప్రతి స్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొనాలన్నారు. అందుకు సైన్స్ టీచర్లు విద్యార్థులను ప్రొత్సహించాలన్నారు. పాఠశాల ఆవరణలో కొటెక్ మహేంద్ర సంస్థ రూ.25లక్షలతో ఆడిటోరియం నిర్మించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ మాసం చివరి వరకు ఉదయం, సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని మిని స్టేడియంలో యోగా క్లాస్‌లు నిర్వహించనున్నామని, ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పడిన కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లిష్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్‌లను ఉపయోగించుకుని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డివిజన్ సాధించి తీరుతాం

30న ప్రజా సంకల్ప దీక్షకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతామని, ఈ నెల 30న తలపెట్టిన ప్రజా సంకల్ప దీక్షకు ప్రజలు తరలిరావాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జేఏసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంకల్ప దీక్షను విజయవంతం చేసే దిశగా డివిజన్ స్థాయి, మండల జేఏసీ కమిటీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆగంరెడ్డి, జీవన్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, అశోక్, బీరయ్య, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

అదనపు కలెక్టర్‌కు టీఎన్‌జీఓల వినతి

సిద్దిపేటరూరల్: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి చేయడం దారుణమని, వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీఎన్జీఓ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ అధ్యక్ష, ప్రధానకార్యర్శులు పరమేశ్వర్, విక్రంరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏది ఆదేశిస్తే అందుకు అనుగుణంగా పనిచేయడం ప్రభుత్వ ఉద్యోగుల పని అన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న అధికారులపై దాడి చేయడం సరైంది కాదన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందిస్తున్న టీఎన్‌జీఓలు

కార్యక్రమంలో టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ యూనిట్ కార్యదర్శి నగేష్, ఉపేందర్, సుమన్, సాయి, మనోహర్, చైతన్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో చిరుతపులి కలకలం

బోను ఏర్పాటుకు అధికారుల ఏర్పాట్లు

సిద్దిపేటఅర్బన్: బూరుగుపల్లి శివారులోని వ్యవసాయ బావుల వద్ద చిరుతపులి తన పిల్లలతో కలిసి సంచరిస్తోందనే విషయం మంగళవారం కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం వేళ గ్రామానికి చెందిన స్వామి, నర్సింహులు అనే యువకులు తమ వ్యవసాయ బావి వద్ద గేదె పాలు పితకడానికి వెళ్లారు. ఆ సమయంలో రెండు చిరుత పిల్లలు వారికి కొంత దూరంలో కనిపించాయి. భయపడిన యువకులు అక్కడి నుంచి గ్రామంలోకి పరిగెత్తుకు వచ్చారు. విషయం ఫారెస్టు అధికారులకు తెలపడంతో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మ, బీట్ అధికారులు గ్రామస్తులతో కలిసి పులి జాడ కోసం గాలించారు. అయినా పులి ఆనవాళ్లు కనిపించలేదు. డిప్యూటీ ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ తెల్లవారిన తర్వాత పాదముద్రల కోసం గాలింపు చేపడతామన్నారు. చిరుతపులిని చూశామని గ్రామస్తులు చెప్తున్నారన్నారు. ప్రజలు భయాందోళనలకు గురవుతున్న నేపథ్యంలో బోను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు పొలాల వద్దకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగించాలని, గజ్వేల్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీపీవోలు వారంలో రెండుమూడు సార్లు గ్రామాలను సందర్శించాలని సూచించారు. సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గజ్వేల్ పీఎస్‌లో వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను యజమానులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రూప్ 3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- అధికారులతో సమావేశం

సిద్దిపేటరూరల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఈ నెల 17 నుంచి జరిగే గ్రూప్–3 పరీక్ష నిర్వహణకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులతో అబ్దుల్ హమీద్ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ వీపీ. రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37 సెంటర్లలో 13,408 మంది అభ్యర్థులు గ్రూప్ 3 పరీక్ష రాయనున్నారని అన్నారు. సబ్జెక్ట్‌ల వారీగా మూడు పేపర్లు ఉంటాయన్నారు. 17న ఉదయం 10 నుంచి 12:30వరకు జనరల్ స్టడీస్– జనరల్ ఎబిలిటీ పేపర్–1, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు హిస్టరీ–సొసైటీ పేపర్–2, 18న ఉదయం 10గంటల నుంచి 12:30 గంటల వరకు ఎకానమీ డెవలప్‌మెంట్ పేపర్–3 పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు పరీక్ష సమయానికి అర గంట ముందు అనుమతించి, బయోమెట్రిక్ చేస్తారన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా సమయానికి అనుకూలంగా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

పటిష్ట బందోబస్తు

సిద్దిపేటకమాన్: గ్రూప్ 3 పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సీపీ కార్యాలయంలో ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్‌లతో అదనపు డీసీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలుచేపడుతున్నామన్నారు కార్యక్రమంలో గ్రూప్ 3 నోడల్ అధికారి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపీకి ఆహ్వానం



ఎంపీకి ఆహ్వానపత్రిక అందిస్తున్న నరేశ్

చేగుంట(తూప్రాన్): స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేగుంటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రావాలని ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వానం అందించినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేశ్ తెలిపారు. అండర్–14 బాలబాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల ప్రారంభ, ముగింపు కార్యక్రమాల్లో పాల్గొనాలని రఘునందన్‌రావుకు ఆహ్వానం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలపై అవగాహన, ఉపాధి

జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్

సిద్దిపేటరూరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక, ఉపాధి కర్మాగారాల శాఖ ద్వారా జిల్లాలోని అర్హత, నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నీల రాఘవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన హుస్నాబాద్, కోహెడ మండల కార్యాలయాల్లో, అక్కన్నపేట రైతు వేదికలో విదేశీ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడంతోపాటు పలు రకాల ఖాళీల భర్తీకి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆటోమేటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటార్ డ్రైవర్స్, టెక్నికల్, వేర్ హౌస్, ఫుడ్ టెక్నీషియర్, హాస్పిటాలిటీ వంటి ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 20 నుంచి 40 ఏళ్లలోపు ఉండి పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు టామ్‌కామ్ ద్వారా జర్మనీ భాషా నైపుణ్యాలను కూడా నేర్పించడం జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9440052592, 8125251408, www.tomcom.telangana.gov.inను సంప్రదించాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జీడిమెట్లకు చెందిన బుస్స లింగం రెండు ఆటోల్లో దండుపల్లిలోని శివ అనే వ్యక్తికి అమ్మడానికి తీసుకెళ్తున్నాడు. పక్కా సమాచారంతో బియ్యం పట్టుకొని సీజ్ చేసి, శివపై, అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ దీక్షిత్ తెలిపారు. అనంతరం బియ్యం ఆటోలను సేఫ్ కస్టడీకి తరలించినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సిద్దిపేటఅర్బన్: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి కథనం మేరకు.. మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన శివంది అమరావతి (26) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. చికిత్స చేయించుకున్నా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. అక్టోబర్ 26న వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు అదే రోజు సిద్దిపేట ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త, 18 నెలల కూతురు ఉన్నారు. మృతురాలి తల్లి పయ్యావుల లక్ష్మి ఫిర్యాదు మేరకు సిద్దిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్లపై ధాన్యం.. తీస్తోంది ప్రాణం

రహదారులపై వడ్లు ఆరబోస్తున్న రైతులు

- నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం
- గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- శివ్వంపేట రోడ్లపై భయానకర పరిస్థితులు



చిన్నగొట్టిముక్ల- జీడిపల్లి ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన ధాన్యం కల్లాలు

శివ్వంపేట(నర్సాపూర్) : ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఆరబెట్టుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. కల్లాలు అందుబాటులో లేక ప్రతీసారి ఇదో సమస్యగా మారింది. తేమ శాతం ఎక్కువగా లేకుండా చేసుకోవడానికి ధాన్యం ఆరబోతకు రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం రోడ్ల వెంట వెళ్లే వాహదారులకు ధాన్యం కుప్పలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు.

చర్యలు శూన్యం..

నిత్యం వాహనాల రద్దీ ఉండే ప్రధాన రోడ్లపై ధాన్యం కల్లాలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాల్సిన పోలీస్, ఆర్‌అండ్‌బీ శాఖల సిబ్బంది పట్టించుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ధాన్యం కుప్పలు కనిపించక ఢీకొని గాయాలపాలవడంతోపాటు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

10 కిలో మీటర్ల వరకు కుప్పలు..

- ఖరీఫ్, రబీ పంటలు చేతికొచ్చిన ప్రతిసారి పలువురు రైతులు రోడ్లను కల్లాలుగా మారుస్తున్నారు.
- చిన్నగొట్టిముక్ల నుంచి మనోహరాబాద్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు 10 కిలో మీటర్ల వరకు ధాన్యం కల్లాలతో నిండిపోయింది.
- నర్సాపూర్– వెల్దుర్తి ప్రధాన రోడ్డు ధాన్యపు కుప్పలతోనే దర్శనమిస్తుంది.
- పోతారం చౌరస్తా నుంచి రామాయిపల్లి హైవే వరకు ఉన్న రోడ్డు పై పలుచోట్ల ధాన్యపు కుప్పల ఏర్పాటు చేశారు.
- తూప్రాన్– వెల్దుర్తి ప్రధాన రోడ్డు వద్ద కుప్పలతో ఒకవైపు పూర్తిగా నిండిపోయింది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- పోతారం వద్ద 10 రోజుల కిందట రోడ్డు పై ధాన్యం ఉండడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎదురుగా వచ్చి బైక్‌ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు.
- ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న టీఏ సురేందర్ సోమవారం ఉదయం బైక్‌పై వస్తుండగా సికింద్లాపూర్ వద్ద ధాన్యం కుప్పలను ఢీకొని కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించారు.
- వారం రోజుల కిందట టిక్యదేవమ్మగూడం తండాకు చెందిన ఇద్దరు చిన్నగొట్టిముక్ల వద్ద ప్రమాదానికి గురయ్యారు.
- రెండేళ్ల కిందట శివ్వంపేటకు చెందిన హరిబాబుగౌడ్ (హోంగార్డు) విధులకు బైక్ వెళ్తుండగా సికింద్లాపూర్ వద్ద ధాన్యం కుప్పను ఢీకొని అదుపుతప్పి పడిపోయి మృతి చెందాడు.
- మూడేళ్ల కిందట గోమారం శివారులో పాంబండ గ్రామానికి వడ్డె రమేశ్ బైక్‌పై వస్తుండగా వడ్ల కుప్పకు ఢీకొని మృతి చెందాడు.
- రోడ్లపై ధాన్యం కుప్పల వల్ల నిత్యం బైక్‌లతోపాటు కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి.

మా తమ్ముడు చనిపోయాడు



రోడ్లపై ధాన్యం కుప్పలు వేయడం వల్ల సికింద్లాపూర్‌లో బైక్ అదుపుతప్పి పడిపోయి మా తమ్ముడు హరిబాబుగౌడ్ చనిపోయాడు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్డుపై కల్లాలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్‌గౌడ్, శివ్వంపేట

భార్యా పిల్లలను కోల్పోయా



10 రోజుల కిందట పోతారం వద్ద ధాన్యం కుప్పల వల్ల ట్రాక్టర్ బైక్‌ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నా భార్య, ఇద్దరు పిల్లలు, అన్నను కోల్పోయా. రోడ్డు పై ధాన్యం కుప్పలు ఉంచకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– కుమార్, పోతారం

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై రైతులు కల్లాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటాం. జరుగుతున్న ప్రమాదాల గురించి వారికి అవగాహన కల్పించి బహిరంగ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసుకునేలా సూచిస్తాం. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు.

– రంగకృష్ణ, సీఐ, తూప్రాన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

అమాయకులను చంపిన సైకో కిల్లర్

- వారం రోజుల వ్యవధిలో ఇద్దరి హత్య
- రైల్వేస్టేషన్లలో అపరిచిత వ్యక్తులతో స్నేహం
- ఆపై చిన్నశంకరంపేటకు తీసుకొచ్చి మద్యం సేవించి హత్య
- గతంలోనూ ఇదే తరహా నేరాలతో జైలుకెళ్లిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: హత్యలు పగతో చేస్తారు.. లేదా ప్రతీకారంతో చేస్తారు కానీ ఈ నిందితుడు మాత్రం రైల్వేస్టేషన్లలో ఒంటరి వ్యక్తులను పరిచయం చేసుకొని మద్యం తాగించి, అనంతరం దూర ప్రాంతాలకు తీసుకెళ్లి అకారణంగా హత్య చేస్తాడు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరిని దారుణంగా హత్య చేసి తగులబెట్టిన ఈ సైకో కిల్లర్‌తోపాటు అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఒట్టెం మల్లేశం (గొల్ల మల్లేశం) 2013లో ఓ హత్యకేసులో పదేళ్లపాటు జైలు శిక్ష అనుభవించి 2017లో బయటకొచ్చాడు. అలాగే 2019లో కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నేతాజీ నగర్‌లో ఉండే ఓ మహిళా ఉద్యోగిని ఇంటికెళ్లి తలుపులు తగులబెట్టాడు. ఈ కేసులోనూ మళ్లీ జైలుకు వెళ్లాడు. 2022లో జైలు నుంచి విడుదలై కాచిగూడ–నిజామాబాద్ రైళ్లలో నిత్యం తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా ఉన్నవారిని పరిచయం చేసుకొని, వారితో స్నేహం చేసి మద్యం తాగించి అకారణంగా హత్యలు చేస్తున్నాడు. అనంతరం వారి వద్ద ఉన్న వస్తువులు తన అన్న ఒట్టెం రమేశ్ (గొల్ల రమేశ్)కు ఇచ్చేవాడు.

రైల్వేస్టేషన్‌లో పరిచయం చేసుకొని..

గత నెల 22న మల్లేశం నిజామాబాద్‌లో గల లేబర్ అడ్డా వద్ద కామారెడ్డి జిల్లా పోసానిపేట గ్రామం రామారెడ్డి మండలానికి చెందిన నవీన్‌ను పరిచయం చేసుకున్నాడు. అతడిని రైల్‌లో మీర్జాపల్లికి రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చి చిన్నశంకరంపేట వైన్స్‌లో మద్యం తాగించి పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రి వెనుక వైపు బండరాయితో కొట్టి చంపి కాల్చి వేశాడు. ఈనెల 3న ఇందల్‌వాయి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నపల్లి గ్రామానికి చెందిన కొమ్రె స్వామిని పరిచయం చేసుకొని మద్యం తాగించి స్థానిక బస్టాండ్ వద్ద బండరాయితో మోది హత్య చేసి కాల్చివేశాడు.

నిందితుడి గత నేరాలు

నిందితుడు మల్లేశం రెండు దారుణ హత్యలతో పాటు అక్టోబర్ 31న కాచిగూడ రైల్‌లో ప్రయాణిస్తూ ఓ వ్యక్తిని సుత్తితో కొట్టి బంగారు చైను, ఉంగరం, వెండి బ్రాస్‌లైట్, మొబైల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. ఇదే రైలులో మరో వ్యక్తి పడుకోగా అతడిని సైతం కొట్టి ల్యాప్‌టాప్ దొంగిలించాడు. దోచుకున్న వస్తువులను తన అన్న రమేశ్‌కు ఇచ్చేవాడు.

9 రోజుల్లో ఛేదించిన పోలీసులు

వరుస హత్య కేసులను ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడిని, అతడి అన్నను కేవలం 9 రోజుల్లో పట్టుకొని రిమాండ్‌కు చేశారు. కేసు దర్యాప్తులో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనుమానితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు ఒప్పుకున్నాడు. కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజ్‌గౌడ్, చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ, రామాయంపేట ఎస్సై బాల్‌రాజులతో పాటు పలువురు పోలీస్ కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్ పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ రుద్రారం

చిన్నశంకరంపేట(మెదక్): వరుస హత్యల కేసులో నిందితుడు తమ గ్రామస్తుడే అని తెలుసుకొని రుద్రారం గ్రామస్తులు ఉలిక్కిపడుతున్నారు. గ్రామంలో సైలెంట్‌గా కన్పించిన యువకుడు ఇద్దరిని దారుణంగా హత్య చేయడం కలకలం రేపింది. పదేళ్ల కిందట హత్య కేసులో జైలుకెళ్లిన మల్లేశం తర్వాత గ్రామంలో కన్పించలేదు. ఎక్కడున్నాడో ఎం చేస్తున్నాడు ఎవరికి తెలియలేదు. రెండేళ్ల క్రితం గ్రామానికి చేరుకున్న మల్లేశం అప్పుడప్పుడూ సోదరుడి వెంట గొర్రెల కాడికి వెళ్తుండటంతో మనిషిగా మారాడని అంతా అనుకున్నారు. ఇంతలోనే మళ్లీ హత్యలు చేయడంతో గ్రామంలో అలజడి నెలకొంది.

ప్రజా సంక్షేమం కోసమే వ్రతం



వ్రతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- పాల్గొన్న సిద్దిపేట, కరీంనగర్ కలెక్టర్లు

హుస్నాబాద్: పవిత్రమైన కార్తీక మాసం పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు శ్రీ రమా సహిత సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సతీసమేతంగా సత్యదేవుడికి పూజలు చేశారు. అనంతరం పండితులు పొన్నం దంపతులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.పూజా కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్ కలెక్టర్లు మిక్కిలినేని మను చౌదరి, పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రజలందరు బాగుండాలని వ్రతం నిర్వహించామన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో ఎదురైన అనుభవాలే..

- రాజకీయాల్లోకి రావడానికి కారణం
- మాజీ డీఎస్పీ మధనం గంగాధర్



మాట్లాడుతున్న గంగాధర్

సిద్దిపేటకమాన్: సంచార జాతిలో జన్మించి ఉన్నత ఉద్యోగం సాధించి ఉద్యోగాన్ని సైతం వదులుకొని యువతకు, ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి రావడం జరిగిందని మాజీ డీఎస్పీ మధనం గంగాధర్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచి చాలా కష్టపడి ఎస్సై ఉద్యోగం సాధించి, డీఎస్పీ స్థాయి వరకు వచ్చానన్నారు. విధి నిర్వహణలో అనేక అవార్డులు, రివార్డులు పొందినట్లు తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువ నాయకత్వం అవసరమని వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. తాను రాజకీయాల్లోకి రావడానికి ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలే ప్రధాన కారణమన్నారు. రాబోయే రోజుల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేయనున్నట్లు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేటరూరల్: దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు నిర్మించనున్న నేషనల్ హైవేను రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్మాణం చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నూతన ప్రతిపాదిత సూర్యాపేట–సిరిసిల్ల జాతీయ రహదారి 365బీ ద్వారా భూములు కోల్పోయే సిద్దిపేట పరిసర మర్పడ్గతోపాటు మరో 7 గ్రామాల రైతులు, నేషనల్ హైవే అధికారులు, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ డీపీఆర్‌ను తయారు చేసిన ఏజెన్సీ ప్రతినిధి మురళీ ప్రొజెక్టర్ ద్వారా ప్రతిపాదిత రహదారి మ్యాప్‌ను వివరించారు. అనంతరం రఘునందన్‌రావు మాట్లాడుతూ దుద్దెడ నుంచి రామంచ వరకు పల్లెటూర్ల మీదుగా వెళ్తున్న ప్రతిపాదిత రోడ్డు పై రైతులు అభ్యంతర వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనికోసం 3 ప్రత్యామ్నాయ రహదారులను ప్రతిపాదిస్తున్నానన్నారు. ఇందులో ఏది రైతులకు అనుకూలంగా ఉంటుందో దానిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణ, సంబంధిత గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలుగా యువకులు

పోలీసుల అదుపులో నలుగురు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ సమీపంలోని లక్ష్మీ నర్సింహ్మా వెంచర్‌లో గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం తమ సిబ్బందితో దాడి చేశారు. పట్టణానికి చెందిన నలుగురు యువకులు నీలం అజయ్, సామగారి లోకేశ్, మామిండ్ల తరుణ్, అమిత్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గంజాయికి అలవాటు పడిన మరో 20 మంది యువకులను, వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. సమావేశంలో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం, తదితరులు పాల్గొన్నారు.

కూతురు పుట్టిన మరునాడు తండ్రి మృతి

డీసీఎంను ఢీకొట్టిన బైక్



విజయ్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): కూతురు పుట్టిన కొన్ని గంటల వ్యవధిలోనే తండ్రి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. కూచారం గ్రామానికి చెందిన మజ్జతి విజయ్, మౌనికకు మూడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. సోమవారం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండోసారి కూతురు పుట్టింది. అప్పటి వరకు ఆస్పత్రి వద్దే ఉన్న విజయ్ మంగళవారం స్వగ్రామానికి చెందిన ప్రేమ్ చంద్ అనే వ్యక్తి స్కూటీపై ఇంటికి బయలుదేరాడు. మనోహరాబాద్ శివారులోకి రాగానే దండుపల్లి వద్ద డీసీఎం యూటర్న్ అవుతుండగా బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో విజయ్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రేమ్ చంద్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీ కింద నిద్రించిన వ్యక్తి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : లారీ కింద పడుకున్న వ్యక్తిపై నుంచి డ్రైవర్ చూసుకోకుండా తీసుకెళ్లడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ నుంచి నల్లగండ్ల వెళ్లే మార్గంలో సాయిబాబా ఆలయం సమీపంలో మంగళవారం రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి నిద్రించాడు. డ్రైవర్ లారీ కింద పడుకున్న వ్యక్తిని గమనించకుండా ముందుకు తీశాడు. దీంతో ఆ వ్యక్తి దుర్మణం చెందాడు. మృతుడి వయస్సు 30 ఏళ్ల ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతుని ఎడమ చేతిపై సంతోష్ అని పచ్చబొట్టు ఉంది. వివరాలు తెలిస్తే వెంటనే కొల్లూరు పోలీసులను సంప్రదించాలని కోరారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి

గజ్వేల్‌రూరల్: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పెద్ద యాదయ్య (54) కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం గజ్వేల్ పట్టణానికి వచ్చి లక్ష్మీప్రసన్నకాలనీలో నివాసముంటున్నాడు. పాత ఇనుప సామాన్ల వ్యాపారం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. అయితే, 11వ తేదీన సాయంత్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో పట్టణ పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా సంగాపూర్ సమీపంలోని కదుళ్ల కుంటపై ద్విచక్ర వాహనం కనిపించింది. కుంటలో పరిశీలించగా యాదయ్య మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం యాదయ్య మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పోలీసులమంటూ కారు అపహరణ



నారాయణఖేడ్: పోలీసులమంటూ గుర్తు తెలియని దొంగలు కారును అపహరించుకుపోయిన ఘటన సోమవారం అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మోర్గి క్రాస్‌రోడ్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మనూరు మండలం ఉసిరికపల్లికి చెందిన విష్ణు ఏపీ 23 ఏడీ 9666 కారులో రాత్రి 11 గంటల ప్రాంతంలో మోర్గి వైపు వెళ్తూ క్రాస్‌రోడ్ వద్ద మూత్ర విసర్జనకు కారు నిలిపాడు. అదే సమయంలో బులేరో వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తాము పోలీసులమంటూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. వాహనంలో తమ సారు ఉన్నాడంటూ అక్కడికి రావాలని చెప్పారు. విష్ణు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కారు తీసుకెళ్లారు. బులేరో వాహనం కూడా దాంతో పాటు తీసుకెళ్లిపోయారన్నారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 89786 91503, 99515 17369 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విష్ణు కోరాడు. ఈ విషయంపై డీఎస్పీ వెంకట్‌రెడ్డిని సంప్రదించగా తగు విచారణ చేస్తామని చెప్పారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి

దుబ్బాక: రాష్ట్రంలో ప్రజలను మోసం చేస్తూ పూర్తిగా నిరంకుశ పాలన కొనసాగుతుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపల్లి యాదగిరి అన్నారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గ బీఎస్పీ నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేస్తామంటూ కాంగ్రెస్ నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక పూర్తి విరుద్ధంగా పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. అలాగే బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాశ్, ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సుద్దాల రాజు రజక, ఉపాధ్యక్షుడిగా బండ నర్సింలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలుగా మోతె నర్సింలు, మ్యాదరి నర్సింలును నియమించారు.

పెట్రోల్‌లో నీళ్లు



పెట్రోల్‌లో కలిసిన నీరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్‌తోపాటు వాటర్ రావడంతో వాహనదారుడు కంగుతిన్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అల్లీపూర్‌కు చెందిన వాహనదారుడు మంగళవారం బైక్‌లో పెట్రోల్ పోయించుకొని ఇంటికెళ్లాడు. పనిమీద బయటకు వెళ్లడానికి బైక్ తీయగా స్టార్ట్ కాలేదు. బైక్‌ను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చూయించగా పెట్రోల్‌లో నీరు కలిసిందని చెప్పాడు. వాహనదారుడు బాటిల్‌లో పెట్రోల్ తీసుకొని బంక్ సిబ్బందిని నిలదీశాడు. తాము పెట్రోల్ నీళ్లు కలపలేదని సమాధానివ్వడంతో ఇరువురు గొడవపడ్డారు. పెట్రోల్ కల్తీ చేస్తున్న బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.